నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
30 అక్టోబర్ 2024
పేజీలు 8

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్

తెలంగాణ ప్రభుత్వం పోలీస్ సిబ్బంది పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో శంకుస్థాపన చేసింది. ఇందులో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. బస చేసేందుకు వసతులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఉంటాయి. సర్వీసులో ఉన్న, అమరులైన, ఇతర యూనిఫాం సర్వీసులో పనిచేస్తున్న వారి పిల్లలకు ప్రవేశం కల్పిస్తారు. పోలీస్, ఫైర్, ఎక్సైజ్, ఎస్‌పీఎఫ్, జైళ్ల శాఖ వంటివి ఈ పరిధిలోకి వస్తాయి.

## క్రీడలు

### టీ-20 ప్రపంచ కప్

- మహిళల టీ-20 ప్రపంచ కప్‌ను న్యూజిలాండ్ జట్టు గెలుచుకుంది. తుది పోరులో దక్షిణాఫ్రికాను ఓడించింది. టోర్నీ అక్టోబర్ 3 నుంచి 20 వరకు యూఏఈలోని దుబాయ్‌లో నిర్వహించారు. ఇది బంగ్లాదేశ్‌లో నిర్వహించాల్సి ఉండగా అక్కడి రాజకీయ ఇబ్బందుల నేపథ్యంలో వేదికను మార్చారు.

### బాలా దేవి



- భారత ఫుట్‌బాల్ క్రీడాకారిణి బాలా దేవి కొత్త రికార్డ్‌ను సృష్టించింది. 50 అంతర్జాతీయ గోల్స్ సాధించిన భారత తొలి మహిళగా ఆమె ఘనత దక్కించుకున్నారు. 2005 నుంచి ఆమె జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆమె మణిపూర్ రాష్ట్రానికి చెందినవారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నారు.

### దీపిక కుమారి

- మహిళల ఆర్చరీ ప్రపంచ పోటీలో భారత క్రీడాకారిణి దీపిక కుమారి వెండి పతకాన్ని గెలుచుకుంది. ఈ పోటీలు మెక్సికోలో నిర్వహించారు.

### యూఎన్‌డీపీ

- ప్రపంచ వ్యాప్తంగా 112 దేశాల్లో 6.3 బిలియన్ల మంది ప్రజలు పేదరికంలో 1.1 బిలియన్ల మంది ప్రజలు తీవ్ర బహుళ పార్శ్వ కోణ పేదరికంలో ఉన్నారని యూఎన్‌డీపీ, ఆక్స్‌ఫర్డ్ పావర్టీ ఇచ్చిన నివేదిక పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లోనే 962 మిలియన్ల పేదలు ఉన్నారని తెలిపింది. ఐదు దేశాల్లోనే మొత్తం పేదల్లో 48.1% ఉన్నారని తెలిపింది. ఆ ఐదు దేశాలు భారత్, పాకిస్థాన్, ఇథియోపియా, నైజీరియా, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోగా పేర్కొంది.

## వార్తల్లో వ్యక్తులు

### విజయ రహత్కర్




- జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలిగా విజయ రహత్కర్‌ను నియమించారు.

### లౌంగ్ కౌంగ్

- వియత్నాం నూతన అధ్యక్షుడిగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వియత్నాం పార్టీకి చెందిన లౌంగ్ కౌంగ్ ఎన్నికయ్యారు.

### అభ్యుదయ్ జిందాల్

- జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న అభ్యుదయ్ జిందాల్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



### దారాసింగ్ ఖురానా

- మహాత్మాగాంధీ నాయకత్వ అవార్డును ప్రముఖ నటుడు దారాసింగ్ ఖురానాకు ప్రకటించారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నందుకు ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

## అంతర్జాతీయం

### గ్లోబల్ ఫ్యామిలీ ఫామింగ్ ఫోరం

- ఇటలీలోని రోమ్ కేంద్రంగా పనిచేసే ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ, అంతర్జాతీయ నిధి సంస్థ సంయుక్తంగా వ్యవసాయాభివృద్ధి కోసం ప్రపంచ కుటుంబ వ్యవసాయ ఫోరంను ఏర్పాటు చేశాయి. సుస్థిర వ్యవసాయానికి, ఆహార భద్రతకు, వ్యవసాయ ఆహార వ్యవస్థల సృష్టికి కుటుంబాలు చేస్తున్న కృషిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశించింది ఇది. 2019-28 దశాబ్దాన్ని ఐక్యరాజ్యసమితి కుటుంబ వ్యవసాయ దశాబ్దంగా ప్రకటించింది.



### కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్



- కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్‌కు సంబంధించిన ఒప్పందాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తూ భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం కుదిరింది. వీసా ఉన్నవాళ్లు నేరుగా కర్తార్‌పూర్‌లోని దేవాలయాన్ని దర్శించుకునేందుకు అనుమతి ఇస్తారు.
- పాకిస్థాన్ రాజ్యాంగానికి సవరణ చేసింది. ఆ దేశంలో ప్రధాన న్యాయమూర్తి పదవీ కాలాన్ని మూడు సంవత్సరాలకే పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

### మాల్దీవులు

- దేశ ఆర్థిక వ్యవస్థను మరింత వృద్ధి చేసుకొనేందుకు భారత్‌కు చెందిన యూపీఐ సేవలను అందుబాటులోకి తేవాలని మాల్దీవులు నిర్ణయించింది. ఇప్పటికే యూపీఐ సేవలు నేపాల్, భూటాన్, శ్రీలంక, ట్రినిడాడ్-టొబాగో తదితర దేశాల్లో అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే.

### ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి

- పాకిస్థాన్‌లో మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని ఇంటర్నేషనల్ కోవెనెంట్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్ కమిటీ సమీక్షలో తేలింది. అసహనం పెరగడంతో పాటు మైనారిటీ బాలికల మత మార్పిడులు, భావ ప్రకటన స్వేచ్ఛ కట్టడి, ప్రభుత్వ ప్రాధికార సంస్థలతో పాటు సామాజిక మాధ్యమాలను కూడా కట్టడి చేస్తున్నారని గుర్తించారు.

### బ్రిక్స్ ప్రకటన

- చర్చల ద్వారానే శాంతి సాధ్యమని బ్రిక్స్ దేశాలు అభిప్రాయపడ్డాయి. బ్రిక్స్ సమావేశం రష్యాలోని కజాన్‌లో అక్టోబర్ 22 నుంచి 24 వరకు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. పాలస్తీనాలో సంక్షోభాన్ని నివారించడంతో పాటు రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షలు ఎత్తి వేయాలని కోరాయి. రష్యా విత్తన వాణిజ్య వేదికను ఏర్పాటు చేసింది. గ్రెయిన్ ఎక్స్చేంజ్‌గా దీన్ని పిలుస్తున్నారు.భారత్ ప్రారంభించిన ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్‌కు సహకరించాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి.

### పరిశోధన కేంద్రం




- యూఏఈలోని దుబాయ్‌లో ఒక ప్రపంచ పరిశోధన కేంద్రాన్ని ఐఐటీ మద్రాస్ ప్రారంభించనుంది. కృత్రిమమేధ, డేటా సైన్స్, రోబోటిక్స్, సుస్థిర శక్తి వనరులు తదితర అంశాలపై ఇందులో అత్యున్నత స్థాయిలో అధ్యయనం చేయనున్నారు.

### జర్మనీ

- సైనిక పరమైన కొనుగోళ్లకు జర్మనీ భారత్‌కు ప్రత్యేక హోదా ఇచ్చింది. భారతదేశం కొనుగోళ్లకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించింది. వేగంగా ఈ ప్రక్రియలు పూర్తి కానున్నాయి.

## తెలంగాణ

### బయో ప్రాసెస్ డిజైన్ కేంద్రం



- అమెరికాలోని బోస్టన్ కేంద్రంగా పని చేస్తున్న ఫార్చ్యూన్-500 థర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో బయో ప్రాసెస్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. 2025 తొలి త్రైమాసికం నాటికి ఈ డిజైన్ సెంటర్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి, థర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థకు అవగాహన ఒప్పందం కుదిరింది.

### సియోల్‌లో శిక్షణ

- తెలంగాణ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు సియోల్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్ర మంత్రుల బృందం సియోల్ పర్యటనలో ఉండగా అక్కడ క్రీడా విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఒక్కో విద్యార్థి మూడు బంగారు పతకాలు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే ఒప్పందం ఖరారయ్యింది.

### ఎన్‌ఐసీకి ధరణి పోర్టల్

- రాష్ట్రంలో సాగు, ప్రభుత్వ భూముల నిర్వహణ చేపడుతున్న ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూడేళ్ల పాటు ఈ పోర్టల్‌ను ఎన్‌ఐసీ నిర్వహించనుంది. పనితీరును బట్టి మరో రెండేళ్లు ఒప్పందాన్ని పొడిగిస్తారు. ప్రస్తుతం ప్రైవేట్ సంస్థ అయిన టెర్రాసిఐఎస్ ఈ పోర్టల్‌ను నిర్వహిస్తుంది.

### మల్లూరు గుట్టపై ఔషధ మొక్కలు



- ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు గుట్టపై అరుదైన, 500కు పైగా రకాల జాతుల ఔషధ మొక్కలు ఉన్నట్లు వృక్ష శాస్త్రవేత్తలు గుర్తించారు. యూఎన్‌డీపీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సాయంతో సంయుక్తంగా ర్యాపిడ్ అసెస్‌మెంట్ చేపట్టారు. 200 హెక్టార్లలో ఔషధ మొక్కలు విస్తరించి ఉన్నట్లు గుర్తించారు.

## రోజులు-ప్రాధాన్యం

### అక్టోబర్ 24

- 1945, అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితిని ఏర్పాటు చేశారు. అందుకే ఈ రోజును ఐక్యరాజ్యసమితి రోజుగా నిర్వహిస్తారు. అదే విధంగా ఈ రోజున ప్రపంచ అభివృద్ధి సమాచార రోజుగా కూడా చేపడతారు. ప్రపంచ పోలియో రోజు కూడా అక్టోబర్ 24నే. దౌత్యవేత్తల రోజుగా కూడా ఇదే రోజున నిర్వహిస్తారు. భారతదేశానికి చెందిన దౌత్యవేత్త అభయ్ కుమార్ సూచన మేరకు 2017 నుంచి ఈ రోజును దౌత్యవేత్తల రోజుగా నిర్వహిస్తున్నారు.

### అక్టోబర్ 21




- ఏటా అక్టోబర్ 21న వరల్డ్ అయోడిన్ డెఫిషియన్సీ రోజుగా నిర్వహిస్తారు. శారీరక, మానసిక ఎదుగుదలకు అయోడిన్ చాలా అవసరం. దీని వల్ల అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన రోజు ఇది. థైరాయిడ్ హార్మోన్లు, థైరాక్సిన్ తదితరాలకు సంబంధించి జీవక్రియలకు అయోడిన్ చాలా కీలకం.

### అక్టోబర్ 20

- ఏటా అక్టోబర్ 20న వరల్డ్ స్టాటిస్టిక్స్ డే గా నిర్వహిస్తారు. ఈ రోజు నిర్వహణకు 2010లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ తీర్మానాన్ని ఆమోదించింది. గణాంకాల ప్రాధాన్యం, దానివల్ల విధానాలను రూపొందించే వాళ్లకు కలిగే ప్రయోజనాన్ని అందరికీ తెలిపేందుకు ఉద్దేశించింది ఈ రోజు.

### లడఖ్‌లో గస్తీ



- తూర్పు లడఖ్‌లో ఘర్షణ ఉండే ప్రదేశాల్లో గస్తీకి సంబంధించి భారత్, చైనా మధ్య అంగీకారం కుదిరింది. గల్వాన్ లోయ తర్వాత ఇరు దేశాల మధ్య ఈ తరహా ఒప్పందం కుదరడం ఇదే ప్రథమం. తూర్పు లడఖ్‌లోని పాంగాంగ్ త్సో, గల్వాన్ నాలా, డెమ్‌చోక్ తదితర ప్రదేశాల్లో పెట్రోలింగ్ నిర్వహించనున్నారు.

### మారిషస్

- భారతదేశం తొలిసారి రూపాయి రూపంలో లైన్ ఆఫ్ క్రెడిట్ రూపంలో మారిషస్‌కు రూ. 487.60 కోట్లు ఇవ్వనుంది. ఇటీవల భారత్ ఐడీఈఏఎస్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని పూర్తి రూపం- ఇండియన్ డెవలప్‌మెంట్ అండ్ ఎకనామిక్ అసిస్టెన్స్ స్కీం

### సర్దార్ పటేల్ జయంతి

- భారత తొలి హోం మంత్రి, తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రెండు సంవత్సరాల పాటు వేడుకలను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. దేశానికి ఆయన చేసిన సేవలు, అందరికీ తెలిసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

### ప్రసూతి ప్రయోజన చట్టం

- కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ప్రసూతి ప్రయోజన చట్టం వర్తిస్తుందని మద్రాస్ హైకోర్ట్ తాజాగా తీర్పు చెప్పింది. ఈ చట్టం 1961లో చేశారు. దీన్ని 2017లో సవరించారు. సవరణ చట్టం ప్రకారం 12 వారాల పాటు ప్రసూతి సెలవులను ఇస్తారు.

## జాతీయం

### లౌకికత్వం అత్యంత కీలకం

- లౌకికత్వం అనేది భారత రాజ్యాంగంలో మౌలిక స్వరూపంలో భాగమని సుప్రీంకోర్ట్ తాజాగా పేర్కొంది. 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా లౌకికత్వం, సామ్యవాదం పదాలను చేర్చారని, ఈ సవరణను సమీక్షించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్ట్ కొట్టివేసింది. పాశ్చాత్య దేశాల తరహాలో ఉండే సామ్యవాదంలా కాకుండా భారతదేశంలో సమానత్వం, సౌభ్రాతృత్వంపై ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్ట్ తన తీర్పులో వెల్లడించింది. ఈ పదాలను చేర్చడంలో తప్పేమీ లేదని పేర్కొంది.

### నసీం అల్ బహర్




- భారత్, ఒమన్ అక్టోబర్ 13 నుంచి 18 వరకు నసీం-అల్-బహర్ పేరుతో గోవాలో నావికా దళ విన్యాసాలు నిర్వహించాయి.

### దళిత ఉప వర్గీకరణ

- దేశంలో దళిత ఉపవర్గీకరణను అమలు చేయనున్న తొలి రాష్ట్రంగా హర్యానా నిలువనుంది. రాష్ట్రాలకు ఉప వర్గీకరణ చేసే అధికారం ఉందని ఇటీవల సుప్రీంకోర్ట్ తీర్పు చెప్పిన నేపథ్యంలో హర్యానా అమలు చేయనుంది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

